

కృష్ణా కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, తదితరులు





ఏయూ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నట్టు సిరా గుర్తు చూపిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



కృష్ణా కళాశాల వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ శిబిరంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, తదితరులు

ప్రశాంతంగా పోలింగ్

- ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులు తీరిన పట్టభద్రులు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



తోటగరువు హైస్కూల్‌లో 281, 282 బూత్‌ల వద్ద క్యూలో ఉన్న ఓటర్లు



తోటగరువు హైస్కూల్‌లో ఓటు వేసి బయటకు వచ్చిన 90 ఏళ్ల వృద్ధుడు శర్మ

ఏయూ క్యాంపస్/ఆరిలోవ/మద్దిలపాలెం/ఎంవీపీ కాలనీ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం తూర్పు నియోజకవర్గం పరిధిలో ప్రశాంతంగా ముగిశాయి. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల, ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఉదయం 10 గంటల వరకు కాస్త మందకొడిగా సాగిన ఎన్నికల ప్రక్రియ తరువాత కాస్త ఊపందుకుంది. పట్టభద్రులు తమ గుర్తింపు కార్డులను చూపుతూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూత్‌లలో ఒక బూత్‌లో ఓటర్లు బారులు తీరి కనిపించారు. ఉదయం 9 గంటల సమయంలో పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

- బ్యాలెట్ పేపర్ పెద్దదిగా ఉండడంతో మడత పెట్టడానికి కొంత మంది ఇబ్బంది పడ్డారు. పోటీదారుల సంఖ్య అధికంగా ఉండడంతో ద్వితీయ ప్రాధాన్యత ఓటును వేయడానికి వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఓటర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. పీడీఎఫ్ మద్దతుతో పోటీ చేసిన డాక్టర్ రమాప్రభ ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎస్.మాధవ్ కుటుంబ సభ్యులు ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, పెన్‌లు అనుమతించలేదు. దీంతో ఉదయం కొంతసేపు పోలీసులతో వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. ఓటు వేయడానికి వచ్చిన పట్టభద్రులు తమ ఫోన్లను బయట వదిలి వెళ్లారు. సెల్‌ఫోన్ విషయమై ముందుగా సమాచారం లేదని, ఇప్పటికిప్పుడు చెబితే ఫోన్ ఎక్కడ పెట్టాలని పలువురు పోలీసులను ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తాము అమలు చేస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో ఓటర్లు తమ ఫోన్లను బయట వదిలి వెళ్లారు. గుర్తింపు కార్డులు పరిశీలించిన తరువాతే పోలీసులు ఓటర్లను పోలింగ్ కేంద్రం పరిసరాల్లోకి అనుమతించారు.
- పోలింగ్ కేంద్రాలకు దాదాపు 300 మీటర్ల దూరం నుంచి వాహనాలు అనుమతించలేదు. దీంతో ఓటర్లు తమ వాహనాలను కేంద్రాలకు కాస్త దూరంగానే పార్క్ చేసి ఓటు హక్కును వినియోగించుకోవడానికి కాలినడకన వెళ్లారు. కొద్ది మందికి సంబంధించిన వివరాలు ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లడంతో వారిని ఓటు వేయడానికి అనుమతించలేదు.
- పోలింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, పీడీఎఫ్‌లకు చెందిన కార్యకర్తలు కూర్చుని ఓటర్లకు అవసరమైన స్లిప్పులు పంపిణీ చేశారు. ఎటువంటి గొడవలు లేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.
- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఏయూ తెలుగు మీడియం పాఠశాలలో 247 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- ఆరిలోవ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5,950 మంది పట్టభద్రుల కోసం పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ 281, 282, 283, 283ఎ, 284, 284ఎ బూత్‌లలో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 7.30 గంటల వరకు సాగింది. నిబంధనల ప్రకారం సాయంత్రం 4 గంటల తర్వాత వచ్చిన వారిని లోపలకు పంపించకుండా పోలీసులు గేటు మూసేశారు. దీంతో ఆ సమయం దాటిన తర్వాత వచ్చిన పట్టభద్రులు నిరాశతో ఇంటి ముఖం పట్టారు. సమయం దాటినప్పటికీ లైన్‌లో ఉన్న వారు అంతా ఓటు వినియోగించుకునేసరికి సాయంత్రం 7.30 గంటలు దాటింది. కొత్తగా ఓటు హక్కు పొందిన వారి నుంచి 90 ఏళ్లు దాటిన వృద్ధులైన పట్టభద్రులు సైతం తమ ఓటు వినియోగించుకోవడానికి ఉత్సాహం కనబరిచారు.
- తోటగరువు హైస్కూల్‌లో 281, 282 బూత్‌లలో 1,350 ఓటర్ల చొప్పున పోలింగ్ నిర్వహించారు. ఈ బూత్‌లలో ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉన్నారు. ఎన్నికల అధికారులు మాత్రం ఆయా బూత్‌లలో మిగిలినవాటి మాదిరిగా బ్యాలెట్ బాక్సులు రెండేసి మాత్రమే ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పేపరు పెద్దది కావడంతో ఓటు వేసేందుకు ఎక్కువ సమయం పట్టింది. దీంతో ఆయా బూత్‌ల వద్ద పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసేంత వరకు పెద్ద క్యూ కొనసాగింది. గంటల తరబడి పట్టభద్రులు నిరీక్షించాల్సి వచ్చింది.
- తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నగర ప్రథమ పౌరురాలు గొలగాని హరి వెంకటకుమారి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆమె ఇక్కడ 281వ బూత్‌లో ఓటు వేశారు. అనంతరం ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని పోలింగ్ అధికారులు, పోలీసులకు ఆమె సూచించారు. పోలింగ్ కేంద్రాన్ని మేయర్‌తో పాటు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, అక్కరమాని వెంకటరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థులు సీతంరాజు సుధాకర్, కోరెడ్ల రమాప్రభ, ఆర్డీవో భాస్కరరెడ్డి, రూరల్ తహసీల్దారు సందర్శించారు.
- మద్దిలపాలెం వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన ఓటింగ్ సిప్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఓటర్లకు సిప్‌లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి నడింపల్లి కృష్ణంరాజు, పార్టీ నాయకులు గుడ్ల సత్యారెడ్డి, అప్పారి గిరిబాబు, ఆళ్ల శివగణేస్, నల్ల రవికుమార్ పాల్గొన్నారు.
- కృష్ణా కళాశాల పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ శిబిరాలను వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సందర్శించారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.
- కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను పీడీఎఫ్ మద్దతు అభ్యర్థి డాక్టర్ రమాప్రభ సందర్శించారు. ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం బూత్ బయట ఓటర్లకు స్లిప్పులు అందజేస్తున్న పీడీఎఫ్ సభ్యుల శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పడాల గోవింద్, సీఐటీయూ కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్, బి.గణేష్ పాల్గొన్నారు.
- ఎంవీపీ కాలనీలో పరిధిలోని 17, 18, 19 వార్డులకు సంబంధించి ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. 225, 226 పోలింగ్ కేంద్రాలను ఎంవీపీ సెక్టార్-5లోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రంలో బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సెక్టార్-10లోని ఆళ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్‌లో 227, 228, 229, 230 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 18వ వార్డు, 19వ వార్డుకు చెందిన పట్టభద్రులు ఈ పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాస్ భద్రతను పర్యవేక్షించారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది.



సమయం దాటిపోవడంతో తోటగరువు హైస్కూల్ గేటు వద్ద నిలిచిపోయిన ఓటర్లు



కృష్ణా కళాశాల పోలింగ్ బూత్ వద్ద పీడీఎఫ్ మద్దతు అభ్యర్థి రమాప్రభ



ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ జీవీఎల్, ఆయన సతీమణి మైథిలి



ఎంవీపీలో ఓటర్లను తనిఖీ చేసి పోలింగ్ కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు

తూర్పులో 58.80 శాతం

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో 58.80 శాతం పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 9 ప్రాంతాల్లో 26 బూత్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో సాగర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మూడు(289, 290, 291) బూత్‌లలో విశాలాక్షినగర్‌కు చెందిన 1025 మంది ఓటర్లలో 550 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

బూత్‌ల వారీగా పోలింగ్ సరళి ఇలా..

బూత్ నంబరు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు
225	930	582
226	790	471
227	1020	628
228	710	428
229	580	306
230	470	270
231	1220	671
232	1340	741
233	1260	752
234	900	554
244	580	365
245	830	519
246	650	393
247	960	588
248	540	323
249	1010	590
250	530	316
281	1360	830
282	1300	754
283	995	603
283ఎ	794	414
284	935	557
284ఎ	635	349
289,290,291	1025	550
మొత్తం	21,364	12,554

క్లుప్తంగా

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



డ్రాలో పాల్గొన్న రైతులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు రైతుబజార్‌లో స్టాళ్లకు సోమవారం డ్రా తీసి రైతులకు కేటాయించారు. ఉదయం 12 గంటలకు రైతుబజార్ ఎస్టేట్ అధికారి వరలక్ష్మి సమక్షంలో ఈ డ్రా తీశారు. తమకు కేటాయించిన స్టాళ్లలో రైతులు బుధవారం నుంచి విక్రయాలు జరపనున్నారు. మంగళవారం రైతుబజార్‌కు సెలవు. ప్రతి సోమవారం డ్రా తీసి రైతులకు స్టాళ్ల కేటాయింపు చేస్తున్నట్లు ఎస్టేట్ అధికారి తెలిపారు.

విలువలతో కూడిన విద్యా బోధన అవసరం

బీచ్ రోడ్డు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యా బోధన అవసరమని జోన్-1 ఆర్‌ఎఫ్‌వో డి.నిరంజన్‌రెడ్డి అన్నారు. పెద్దవాల్తేరులోని సన్ ఫ్లవర్ స్పెషల్ స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, అనాథలకు మంచి విద్యను అందించేందుకు కొన్నేళ్లుగా కృషి చేస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ వేడుకల్లో భాగంగా దివ్యాంగులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ జీఎం ప్రసాద్, రాణా ఉప్పలపాటి, పాలిక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



కంకణ ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరి వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అర్చకులు అందజేశారు.

నేడు పోలిపిల్లమ్మ పండగ



సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంవాసుల ఆరాధ్య దేవత పోలిపిల్లమ్మతల్లి వార్షిక పండగను మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేస్తున్నట్టు చెప్పారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని పురస్కరించుకుని గరగల డ్యాన్స్, బాణసంచా భారీ ఎత్తున కాల్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం నుంచి మూడు వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పండగ నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఉరివిడి ఈశ్వరరావు, ట్రెజరర్ నూనెల దేముడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు



రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వినియోగదారులు కూరగాయలు కొనుక్కునేలా చూడాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల విక్రయాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని రైతులకు సూచించారు. డ్వాక్రా స్టాళ్లలో సంబంధిత మహిళలే ఉండాలన్నారు. ఆకుకూరల రైతులు యాసిన్‌కు తమ సమస్యలు విన్నవించుకున్నారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

సమస్యల సాధనకు ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులు

మహారాణిపేట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాల్గవ తరగతి ఉద్యోగులు సోమ వారం నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం నేడు అయిదో రోజుకు చేరుకుంది. ఏపీజేఏసీ పిలుపు మేరకు ఈ కార్య క్రమం కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్న రెవెన్యూ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యల సాధనకు పోరాటం సాగిస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహ అధ్యక్షుడు లోకేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

16 నుంచి ఐఈఈటీఈ సాంకేతిక ఉత్సవం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా గల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐస్క్వేర్ ఆర్ - 2023 నిర్వహిస్తున్నట్లు విభాగం అధిపతి ప్రొఫెసర్ జె.బి.సెవెస్త్‌లైన్ తెలిపారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల ప్రదర్శనతోపాటు సాంకేతిక అంశాలపై నిపుణులు ప్రసంగిస్తారన్నారు.

760వ రోజుకు చేరుకున్న ఉక్కు దీక్షలు



760వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద తలపెట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు 760వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో సోమవారం ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రభుత్వ రంగ సంస్థల జోలికి రాకుండా ఉంటే మంచిదన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించాలని, లేదంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

డంపింగ్ యార్డును పరిశుభ్రంగా ఉంచండి

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు




కాపులుప్పాడ డంపింగ్ యార్డులో అధికారులకు సూచనలు చేస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ - 2 పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డు, చెత్త నుంచి విద్యుత్ తయారు చేస్తున్న జిందాల్ విద్యుత్ ప్లాంట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తక్షణ చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్ పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జీ 20 సదస్సుకి వచ్చే వివిధ దేశాల ప్రతినిధులు ఇక్కడకు రానున్నందున అధికారులతో కలిసి సోమవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఇప్పటికే నగరంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

పలు దేశాల ప్రతినిధులు నగరంలోని ప్రాజెక్టులు వీక్షిస్తారని, అందుకు ఆయా ప్రాంతాలను మరింత శుభ్రంగా ఉంచాలని సూచించారు. జిందాల్ విద్యుత్ ప్లాంట్ వద్ద టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని, పరిసరాల్లో ప్లాస్టిక్ ఎక్కడా కనిపించకూడదని, పాడైపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. రోడ్డు సెంటర్ డివైడర్లలో ప్లాంటేషన్ చేసి పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణలో విఫలం



మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించి గణాంకాలు చూపుతున్న శ్యాంప్రసాద్

డాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగానే తరచూ మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్ఠ చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ల పనితీరు దారుణంగా ఉందన్నారు. ఆ కమిషన్ల వల్ల ప్రజలకు పెద్దగా ప్రయోజనాలు చేకూరడం లేదన్నారు. మానవ హక్కుల్లో ప్రధానంగా జీవించే హక్కుని ప్రజలు కోల్పోతున్నారని అన్నారు. భావితరాలు మనుగడ సాధించాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. మానవ హక్కులపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు తాము నిరంతరం కృషి చేస్తూనే ఉన్నామని చెప్పారు.